రువాండాలో మార్‌బర్గ్ వైరస్‌తో 15 మంది మృతి

న్యూఢిల్లీ: రువాండా సహా 17 దేశాల్లో మార్‌బర్గ్ వైరస్ అలజడి రేపుతున్నది. ఈ వైరస్ సోకడంతో ఇప్పటికే రువాండాలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మందికి ఈ వైరస్ సోకినట్లు అంచనా. మార్‌బర్గ్ వైరస్ వల్ల వైరల్ హెమరేజిక్ ఫీవర్ వస్తుంది. కొన్నిసార్లు రక్త నాళాలను దెబ్బతీస్తుంది. ఫలితంగా రక్తం స్రవిస్తుంది. గబ్బిలాల నుంచి మానవులకు ఈ వైరస్ సోకుతుంది. ఈ వైరస్ సోకినవారి రక్తం, లాలాజలం, మూత్రం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడేవారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, అతిసార వస్తాయి. ఇది తీవ్ర స్థాయికి చేరినపుడు శరీరం లోపలి భాగాల్లోనే రక్తం స్రవిస్తుంది. అవయవాలు పని చేయడం మానేస్తాయి. చివరికి రోగి మరణానికి దారి తీయవచ్చు. రువాండా సహా ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

నేడు నికేశ్ బినామీల లాకర్లు తెలుస్తం

- నవంబర్‌లో 17 ట్రాప్‌లు, 1 అక్రమాస్తుల కేసు
- ముగ్గురికి జైలు శిక్ష, జరిమానాల విధింపు: ఏసీబీ డీజీ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద కేసుగా పరిగణిస్తున్న హేరూర్ నికేశ్‌కుమార్ ఆస్తులపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నికేశ్‌కుమార్ బినామీల బ్యాంకు లాకర్లను ఇవాళ తెరుస్తారని సమాచారం. సోమవారమే లాకర్లను తెరవాలని భావించినప్పటికీ మంగళవారానికి వాయిదా వేసినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఏసీబీ.. నికేశ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను కూడా విచారించి, అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఏసీబీ నవంబర్‌లో 17 ట్రాప్‌లతో పాటు ఆదాయానికి మించిన ఓ కేసును నమోదు చేసింది. 17 ట్రాప్‌లలో 27 ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులను రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచాల కోసం వేధిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని, ఎక్స్‌లో (twitter @TelanganaACB), ఫేస్‌బుక్‌లో ((@telanganaacb) ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేపే 'డీట్' ప్రారంభం

కంపెనీలకు, నిరుద్యోగులకు మధ్య వారధి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలు, అప్రెంటీస్‌షిప్, ఇంటర్న్‌షిప్‌ల వివరాలను ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఈ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నమోదైన అభ్యర్థులకు కంపెనీలు తమ అవసరాలకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. అభ్యర్థులకు కంపెనీలే నేరుగా మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పంపడంతోపాటు కాల్‌చేసి పిలుస్తాయి. 'డీట్' అనేది కంపెనీలకు, ఉద్యోగార్థులకు మధ్య వారధి లాంటిదని, ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. 'డీట్'లో కనీసం 20 లక్షల మంది అభ్యర్థులను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు 'డీట్' ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తూ..

ప్రజాపాలన సంబురాలా..?

బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మధు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత మధు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 2 : బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తూ.. ప్రజాపాలన సంబురాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచ్‌ల పోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతల ఆరోపణలు, బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్ అక్రమంగా అరెస్టుపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేకే మహేందర్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలని కోరాం.. కానీ, ఇంకా అదే కోవలో చెలరేగిపోతున్నారని మండిపడ్డారు. ఎన్ని కులాలను తిడుతావ్.. ఎందరిని కించపరుస్తున్నావ్ అంటూ కేకే మహేందర్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. ప్రజాపాలన కోసమా.. ప్రతిపక్ష అరెస్టుల కోసమా? ప్రభుత్వం పనిచేస్తున్నదని ప్రశ్నించారు. గురుకులాల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో చనిపోతుంటే పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. కేకే మహేందర్‌రెడ్డి ప్రజల పక్షాన ఉండాలంటే కేటీఆర్ కన్నా ఎక్కువ అభివృద్ధి చేసి, చూపించాలన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. లేకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సిలువేరి చిరంజీవి, కొయ్యడ రమేశ్, కొమురయ్య, కుర్మ రాజయ్య, కుంటయ్య, జగన్, శేఖర్, అమర్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీధర్, బాలయ్య, గుండు ప్రేమ్‌కుమార్, చందు, అఫ్రోజ్, బాల్ రెడ్డి, తిరుపతి, అంజి, రవి తదితరులున్నారు.

కరెంట్ స్తంభాల ఏర్పాటు

'నమస్తే' కథనానికి స్పందన

కోనరావుపేట, డిసెంబర్ 2 : మండలంలోని మామిడిపల్లిలో విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతూ రైతులకు ఇబ్బందిగా మారగా, 'విద్యుత్ తీగలు సరిచేయరూ' అనే శీర్షిక 'నమస్తే తెలంగాణ'లో ఇటీవల ప్రచురితం కాగా, సెస్ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరిచేసి, నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సెస్ ఏఈ దివ్య సిబ్బందికి సూచించగా, సోమవారం ట్రాక్టర్ సాయంతో మరమ్మతులు చేశారు. దీంతో రైతులు, గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కరెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

మాకు ఇద్దరు మాస్టార్లు కావాలి సారూ..

- కలెక్టర్‌ను కలిసిన కోళ్లమద్ది విద్యార్థులు
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

గంభీరావుపేట, డిసెంబర్ 2: మండలంలోని కోళ్లమద్ది మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాలలో భర్తీ చేయాలని సోమవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. పాఠశాలలో 92 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, వారు కలెక్టర్‌కు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను భర్తీ చేయాలని ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి జిల్లా విద్యాధికారికి 15 సార్లు విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు కలిసి వినతిపత్రం అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. చివరకు నేరుగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను భర్తీ చేయాలని స్వయంగా కలెక్టర్‌కు విద్యార్థులు విన్నవించడంతో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య తీరుపై గ్రామస్తులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

కలెక్టరేట్ కార్యాలయంలో ప్లకార్డులతో విద్యార్థులు

రాజన్న ఆదాయం రూ. 6 కోట్ల 83 లక్షలు

ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ టౌన్, డిసెంబర్ 2 : ఈ ఏడాది కార్తీక మాస వేములవాడ రాజన్న ఆదాయం రూ. 6, 83, 58, 172 కోట్లు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు రాజన్నకు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. రెండేళ్ల కొకసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర ఈ ఏడు లేకపోవడంతో ఆదాయం తగ్గినట్లు, ఈ నెలలో హుండీ లెక్కింపు ఒక్కసారి మాత్రమే నిర్వహించడంతో ఆదాయం ఇలా వచ్చిందని అధికారులు వెల్లడించారు. హుండీ ద్వారా రూ. 1,50,24,507, శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ, 63,53,400, ప్రసాదాల అమ్మకాలద్వారా రూ. 1,73,63, 885, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ. 24,18,000, కల్యాణాల టిక్కెట్ల ద్వారా రూ. 39,60,000, కోడె టిక్కెట్ల ద్వారా రూ.1,65,65,000, ఇతర అర్చన టిక్కెట్లద్వారా రూ. 66,73, 380 సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్తీకమాసంలో రాజన్నను సుమారు 15 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

గంభీరావుపేట, డిసెంబర్ 2 : నీటి సంపులో పడి ఓ చిన్నారి మృతిచెందింది. సోమవారం సాయంత్రం గంభీరావుపేట మండలం నర్మాలలో విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నర్మాలకు చెందిన ఉప్పలయ్య శ్రీనివాస్-మాధవి దంపతులకు కొడుకు, కూతురు దేవకి(18 నెలలు) ఉన్నారు. సోమవారం సాయంత్రం ఇంటి పరిసరాల్లోని నీటి కుండిలో చిన్నారి పడి ఉండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గంభీరావుపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సాంఘిక శాస్త్రం బోధనకు ఉపాధ్యాయురాలు కావాలి

బోయినపల్లి, డిసెంబరు 2: బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధించేందుకు (సీఆర్టీ అతిథి) మహిళా ఉపాధ్యాయురాలుగా కావాలని ఆ పాఠశాల ప్రత్యేకాధికారిణి లింగవ్వ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్య సంవత్సరం మాత్రమే విద్య బోధన చేయాలన్నారు. ఆసక్తి ఆర్హత గల అభ్యర్థి సోమవారం బోయినపల్లి కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటకు తరలింపు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 2 : మండలంలోని అంకుసాపూర్‌నకు చెందిన తండ్రీ కూతుళ్లు తగాదా పడి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుసాపూర్‌నకు చెందిన మల్లవేణి నారాయణ సోమవారం కూతురు శిరీషతో గొడవ పెట్టుకోగా, ఎవరికి వారుగా తాను చనిపోతానంటే తాను చనిపోతానని అనుకున్నారు. ముందుగా నారాయణ గడ్డి మందు తాగగా, ఆ తర్వాత శిరీష కూడా మందు తాగింది. వారిని చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని అశ్వినీ దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దవాఖానలో చికిత్స పొందుతున్న నారాయణ